


**1956కు ముందు ఎన్ని దండయాత్రలు జరిగినా.. తమ అస్తిత్వాన్ని, సంస్కృతిని తెలంగాణ ప్రజలు కాపాడుకున్నరు. కానీ, 1956లో మొదలైన పెత్తనం తెలంగాణను దారుణంగా వంచించింది. తేనెపూసిన కత్తిలా తెలంగాణపై విషం చిమ్మింది. నీళ్లు మలుపుకున్నరు. అదేమంటే నీరు పల్లమెరుగు అన్నరు... ఎత్తుమీదున్న తెలంగాణకు నీరెట్లా ఎక్కుతుందన్నరు? నిధులు గుంజుకున్నరు. అదేమంటే.. 'మేం ఉన్నాం కదా మీకు రేషన్ బియ్యం పడేసేందుకు' అన్నరు. ఉద్యోగాలను చెరబట్టారు... అదేమంటే 'మీకు తెలివి లేదు.. మేము ఉద్యోగాలు చేసి మిమ్మల్ని ఉద్ధరిస్తాం' అన్నరు.**

భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 60 ఏండ్లదాకా దేశానికి నడిబొడ్డున ఉన్న ఒక ప్రాంతం.. ఉత్తర, దక్షిణాలకు అనుసంధానంగా ఉన్న ఒక ప్రాంతం తల్లడిల్లిపోతూనే ఉన్నది. ఈ ప్రాంతం స్వేచ్ఛా వాయువులు పీల్చాలని భావించిన ప్రతిసారీ గొంతు పిసుకుతూనే వచ్చారు. ప్రజలను చిన్నగా చేస్తూ... బతుకులను ఛిద్రం చేస్తూ... పండుగలను ఖూనీ చేస్తూ... చదువులను చట్టుబండలు చేస్తూ... సంస్కృతిని కాలరాస్తూ... పరాజితులకు తాము పరాజితులం అయ్యామని కూడా తెలియని చిత్తభ్రమల్లో ముంచెత్తుతూ... అందలాలపై ఆడంబరాలు చేసుకున్నారు. 56లో మోసపోయిన తెలంగాణ 69లో ఒకసారి తెలివి తెచ్చుకున్నది. కానీ, ఏడాది తిరక్కుండానే ఆ తెలివిని తొక్కేశారు. విషం ఇచ్చి మరీ గొంతు నులిమి చంపేశారు. 1972లో మరోసారి గొంతు పెకిలింది. కొద్దిరోజులకే ఆ గొంతును ఖతం పట్టించారు.

పరాయి భాష.. పరాయి చూపులు.. పరాయి భావాలు.. పరాయి చెవులు.. పరాయి నడక.. పరాయి చేతలు.. అన్నీ పరాయివే. అందరిలో ఆశ చచ్చిపోయింది. ఇక మన బతుకులు ఇంతేనన్న నిరాశ ఆవహించింది. తెలంగాణ ఇక మోడువారిన చెట్టే అని అనుకున్నం. దీనికి స్వతంత్రమైన బతుకే లేదని అనుకున్నం. కానీ, శతాబ్దాలపాటు పోరాటం చేసిన తెగువ తెలంగాణ సమాజానిది. కడలిలా కమ్ముకొచ్చే కష్టాల కెరటాల్లోనే బతుకును దేవులాడుకున్న ప్రజలున్న గడ్డ తెలంగాణ. నీళ్లు చల్లనివి.. కానీ, ఆ నీటిలోనే బడబాగ్ని దాగి ఉంటుందన్నట్టుగా ఈ మట్టిలో దాగిన బడబాగ్ని తిరిగి రగిలించడానికి ఒక రాపిడి.. 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి రూపంలో మొదలైంది. 'సిపాయిల తిరుగుబాటు విఫలం అయిందని అనుకుంటే వచ్చేనా దేశానికి స్వాతంత్ర్యం. రాజీలేని పోరాటమే జయిస్తుంది. ముమ్మాటికీ తెలంగాణ వచ్చితీరుతుంది' అని ప్రతినబూని బయలుదేరిండు కేసీఆర్. దశాబ్దాల దాష్టీకాన్ని భరించలేక తన రాజకీయ జీవితాన్ని పణంగా పెట్టిన కేసీఆర్.. తెలంగాణ కోసం దివిటీ పట్టుకొని ధిక్కార స్వరం వినిపించారు. తెలంగాణ ఆత్మగౌరవ జెండా చేబూని పల్లెర్లమీద నడుస్తూ.. ముళ్లనూ, రాళ్లనూ ఒక్కొక్కటిగా తొలగించుకుంటూ లక్ష్యం వైపు తన జాతిని నడిపించుకుంటూ సాగారు. ఆతని తొలి అడుగుకు ఇది రజతోత్సవం. బీఆర్ఎస్ సాధించిన లక్ష్యానికి ఇది పుష్కర సంబురం. పద్నాలుగేండ్ల సుదీర్ఘ పోరాటం... పదేండ్ల దార్శనిక పాలనతో ఆయనే తెలంగాణకు చుక్కాని అయిండు. తెలంగాణ కాలికి ముల్లు గుచ్చుకుంటే పంటితో తీసిండు. తెలంగాణ ఆత్మగౌరవానికి ఆపద వచ్చిన ప్రతీసారి పిల్లలకోడై రక్షించుకున్నడు. ఇది క్రీస్తుపూర్వం చరిత్రకాదు... ఇరవైనాలుగేండ్ల చరిత్ర. అటుకులు తిన్నా... అన్నం తిన్నా.. ఉప్పిడి ఉపాసం ఉన్నా తెలంగాణకు కేసీఆరే రక్ష. ప్రొఫెసర్ జయశంకర్ చెప్పినట్టు స్వీయ రాజకీయ అస్తిత్వమే శ్రీరామరక్ష. జై తెలంగాణ..!

